క్లుప్తంగా

అనధికార లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ గడువు పెంపు

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు

రేపల్లె: అనధికార లేఅవుట్‌లు, ప్లాట్లలను క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 జూన్ 30వ తేదీ ముందు వేసిన అనధికార లేఅవుట్లు, ప్లాట్లను నిర్ణీత అపరాధ రుసుము, 14 శాతం ఓపెన్ స్పేస్ ఛార్జీని చెల్లించి క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. అనుమతించిన లైసెన్స్ సర్వేయర్లు, లైసెన్స్ ఇంజినీర్లు, లైసెన్స్‌డ్ స్ట్రక్చరల్ ఇంజినీర్లు, ఆర్కిటెక్ట్‌లతో తమ స్థలం ప్లాన్‌లను తయారు చేయించుకుని అపరాధ రుసుముతో 50 శాతం గానీ, రూ.10 వేలకు తగ్గకుండా చెల్లించాలన్నారు. జులై 27 నుంచి క్రమబద్ధీకరించుకునే ప్రక్రియ ప్రారంభమైందని, 90 రోజుల పాటు ఈ అవకాశం కల్పించారని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు మున్సిపల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు నైపుణ్యత విద్య



అమర్తలూరు(వేమూరు): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు నైపుణ్యత విద్యను నేర్పించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివశంకరరావు తెలిపారు. పాఠశాలలో శ్రీనివాస్‌రెడ్డి పదవీ విరమణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి 40 ఏళ్లుగా పాఠశాలకు అందించిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.మల్లికార్జునరావు, విజయలక్ష్మీ, కె.సుహాసిని, ఎస్.భాస్కరరావు, ప్రభావతి, వి.మాధురి, విద్యార్థులు పాల్గొన్నారు.

రీ సర్వేపై రైతులకు సమావేశం

వేమూరు: రైతుల భూములను సక్రమంగా గుర్తించేందుకు రీ సర్వే చేయనున్నామని తహసీల్దార్ సుశీల తెలిపారు. కుచ్చెళ్లపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం రీ సర్వేపై అధికారులు రైతులతో సమావేశం నిర్వహించారు. రీ సర్వే నమోదు గురించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుచ్చెళ్లపాడు గ్రామంలో రీ సర్వే పూర్తి చేశామని తెలిపారు. రీ సర్వే చేసిన భూములను కంప్యూటర్‌లో నమోదు చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రవీంద్ర, రీ సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

హాస్యబ్రహ్మ ఆకుల వెంకయ్య చిరస్మరణీయుడు



తెనాలి: జీవితమంతా విషాదం అలముకున్నప్పటికీ రంగస్థలం మీద చింతామణి నాటకంలోని శ్రీహరి పాత్రలో తన సహజ నటనతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన హాస్యబ్రహ్మ ఆకుల వెంకయ్య అని సంఘ సేవకుడు తన్నీరు శివశంకర్ అన్నారు. సుప్రసిద్ధ రంగస్థల నటుడు ఆకుల వెంకయ్య 25వ వర్ధంతిని నందులపేటలోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. కళారంగానికి చెందిన పలువురు వెంకయ్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అభ్యుదయ కళా సమితి వ్యవస్థాపకుడు బొల్లిముంత కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పట్టణ రంగస్థల కళాకారుల సంఘ అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి, ప్రముఖ రంగస్థల కళాకారుడు ఆరాధ్యుల వెంకటేశ్వరరావు ఆకుల వెంకయ్య కళారంగ సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో వెంకయ్య కుటుంబ సభ్యులు చీళ్ల వరలక్ష్మి, చీళ్ల గోపీనాథ్, చీళ్ల నాగేశ్వరరావు, కళాకారుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గరికపాటి సుబ్బారావు, తాడికొండ జగన్మోహనరావు, కొప్పరాజు విజయ్, పాతూరి సుబ్రహ్మణ్యం, పాతూరి సుబ్రహ్మణ్య కవి, లక్కరాజు లక్ష్మణరావు, అయినాల మల్లేశ్వరరావు, వినుకొండ శ్రీరామ్మూర్తి, లక్ష్మీ తులసి, ఆరాధ్యుల ఆదినారాయణ, పలువురు రంగస్థల కళాకారులు పాల్గొన్నారు.

విద్యారంగానికి అంబరీషుడు సేవలు ప్రశంసనీయం

తెనాలి: గత నాలుగు దశాబ్దాలకు పైగా విద్యారంగ అభివృద్ధికి, ఉన్నత పాఠశాల ప్రగతికి ఇ.అంబరీషుడు చేసిన సేవలు ప్రశంసనీయమని గురువారం జరిగిన సభలో పలువురు పేర్కొన్నారు. స్థానిక చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలులో స్కూలు అసిస్టెంట్ (సోషల్)గా విధులు నిర్వహించిన అంబరీషుడు పదవీ విరమణ సత్కార సభను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు కె.రాజారెడ్డి అధ్యక్షత వహించగా.. వార్డు కౌన్సిలర్ జి.మానస రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం అంబరీషుడు సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం పట్టణ శాఖ అధ్యక్షుడు ఏవీ గోపాలరావు, నాయకుడు కనపర్తి బెన్‌హర్, పాఠశాల స్టాఫ్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, అంబరీషుడు కుమారుడు, ప్రముఖ కార్డియాలజిస్ట్ అనిల్ కుమార్, న్యూరాలజిస్ట్ డాక్టర్ అపర్ణస్వాతి దంపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తొలుత అంబరీషుడు, సుమతీ దంపతులను ఘనంగా సత్కరించారు.

- చిట్టడవులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు
- విష సర్పాల సంచారంతో ప్రజల బెంబేలు
- రేపల్లె పట్టణంలో దుస్థితి

నివాసాల మధ్య ముళ్ల పొదలు..

తీరేనా వెతలు!

రేపల్లె: రేపల్లె పట్టణంలో నివాసాల మధ్య ఖాళీ స్థలాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. స్థానిక ఖాళీ స్థలాల్లో ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. ఏళ్ల తరబడి ఉన్న ఖాళీ స్థలాల్లో స్థానికులు చెత్త, వ్యర్థాలను పడవేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతాలు దుర్గంధంగా మారుతున్నాయి. పట్టణంలోని వివిధ వార్డుల్లో 220కి పైగా ఖాళీ స్థలాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఏళ్ల తరబడి ఉన్న సమస్యతో సమీప నివాస గృహాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థల యజమానులు ఆ స్థలాలను బాగు చేయించుకోకపోవడంతో సమస్య జటిలంగా మారుతోంది.

దోమలకు ఆవాస కేంద్రాలుగా..

ఖాళీ స్థలాలు దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. చిన్నపాటి వర్షానికి ఖాళీ స్థలాల్లో నీరు చేరుతుంది. దీంతో పాటు సమీప గృహాలలో వాడిన మురుగు ఈ స్థలాల్లో చేరి రోజుల తరబడి నిల్వ ఉంటోంది. రోజుల తరబడి నీటి నిల్వలు పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఫలితంగా పారిశుద్ధ్యం లోపించడంతో దోమల దాడి పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

> పట్టణంలోని 1, 2, 3, 4, 5, 6, 7, 11, 12, 13, 14, 22, 23, 24, 25, 28 వార్డుల్లో ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఈ స్థలాల్లో ముళ్ల చెట్ల సమస్య అధికంగా ఉంది. ఖాళీ స్థలాలను బాగు చేయించి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులను కోరినా ఫలితం లేదని ఆయా వార్డుల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీ స్థలాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విష సర్పాల సంచారం..

ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు విష సర్పాలకు నిలయాలుగా మారాయి. దీంతో విష సర్పాలు సంచరించడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. పిల్లలు, వృద్ధులు ఇలాంటి ప్రాంతాల పక్కన తిరగడానికే భయపడుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా విష సర్పాలతో పాటు విష పురుగులు సంచారం అధికమైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



23వ వార్డులో నివాసాల మధ్య దట్టంగా పెరిగిన ముళ్ల చెట్లు



25వ వార్డులో చిట్టడవిని తలపిస్తున్న ఖాళీ స్థలాలు

యజమానులకు నోటీసులు జారీ చేశాం..

రేపల్లె పట్టణంలో ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేసుకోవాలని ఇప్పటికే యజమానులకు నోటీసులు జారీ చేశాం. 220కు పైగా ఖాళీ స్థలాలను గుర్తించాం. ఇప్పటి వరకు 150 మందికి పైగా స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేశాం. పలువురు స్థలాలను శుభ్రం చేసుకున్నారు. మరోసారి మిగతా యజమానులతో మాట్లాడతాం. వారు స్పందించని యెడల ఆ స్థలాలను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బాగు చేయించి వాటికయ్యే ఖర్చులను యజమానుల నుంచి వసూలు చేస్తాం.

– రామచంద్రరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన



మాట్లాడుతున్న మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి

మాజీ డెప్యూటీ స్పీకర్ కోన

బాపట్ల: రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన కొనసాగుతోందని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని మండలంలోని ఆదర్శనగర్‌లో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రజలు విరివిగా వచ్చి ప్రభుత్వం తమను ఏ విధంగా మోసం చేసిందో కోన ఎదుట చెప్పి ఆవేదన వ్యక్తం చేశారు. బాబు ష్యూరిటీల్లో ఒక్క హామీ కూడా నెరవేరలేదని తెలిపారు. ఈ సందర్భంగా కోన రఘుపతి మాట్లాడుతూ.. బాధ పడొద్దు.. రానున్నది మన ప్రభుత్వమే.. అన్ని పథకాలు ప్రతి ఒక్కరికీ అందించే బాధ్యత నేనే తీసుకుంటా అని హామీ ఇచ్చారు. మత్స్యకార గ్రామాల్లో కనీసం తాగునీటి సమస్యను కూడా పరిష్కరించలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణ రెడ్డి, నక్కా వీరారెడ్డి, వడ్డిముక్కల డేవిడ్, గవిని కృష్ణమూర్తి, మోర్ల సముద్రాలగౌడ్, కటికల యోహోషువా తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



రేపల్లె: పట్టణాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ కోరారు. స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. పట్టణంలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. వార్డుల్లో పారిశుద్ధ్య పరిరక్షణకు నిరంతరం శ్రద్ధ వహిస్తున్నామన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఎజెండాలోని 32 అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్తా, గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు, కౌన్సిలర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలున్న విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాధాన్యం



ప్రత్యేక అవసరాలున్న విద్యార్థుల వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది

కొల్లూరు: దివ్యాంగ చిన్నారుల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది వారికి ఉన్నత భవిష్యత్తును అందించడానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు జిల్లా సమగ్ర శిక్షా కోఆర్డినేటర్ మట్టా జ్యోత్స్న తెలిపారు. గురువారం కొల్లూరు బీఎస్ఎప్ పాఠశాలలో కొల్లూరు, వేమూరు, భట్టిప్రోలు, అమృతలూరు, చుండూరు మండలాల ప్రత్యేక అవసరాల గల విద్యార్థులకు ఉచిత వైద్య ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఆమె పాల్గొన్నారు. 5 మండలాలలోని 195 మంది విద్యార్థులకు అంగవైకల్యాన్ని అధిగమించడానికి అవసరమైన ఉపకరణాలు అందజేయడానికి నిర్ధారించినట్లు తెలిపారు. క్యాంపులో గుర్తించిన దివ్యాంగులకు ఎయిడ్స్ అండ్ అప్లైయెన్సెస్ యూడీఐడీ కార్డ్స్ అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-1 రమాదేవి, ఎంఈవో-2 వి.సౌభాగ్యజ్యోతి, ఐఈఆర్పీలు, స్పెషల్ ఎడ్యుకేటర్స్ పాల్గొన్నారు.

పోలీసు అధికారులతో సమావేశం రేపు

రేపల్లె: సెప్టెంబరు 13వ తేదిన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారమయ్యేందుకు పట్టణంలోని కోర్టు హాలులో శనివారం ఉదయం 11 గంటలకు పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ వెన్నెల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిమినల్, ఇతర కేసులపై అధికారులతో చర్చించనున్నామని, సమావేశంలో పోలీసు అధికారులు హాజరు కావాలని కోరారు.

కాళిదాసు జీవితం స్ఫూర్తిదాయకం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టరు కోటేశ్వరరావు

బాపట్ల అర్బన్: మాధవపెద్ది కాళిదాసు త్యాగనిరతి, సేవాతత్పరత నేటి తరానికి ఆదర్శ ప్రాయమని వ్యవసాయ కళాశాల ఇన్‌చార్జి ఏడీ డాక్టర్ ఎస్.ఆర్ కోటేశ్వరరావు అన్నారు. గురువారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో గవర్నమెంట్ హాస్పటల్ రోడ్డులో ఏర్పాటు చేసిన కాళిదాసు విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. కాళిదాసు నీతి, నిజాయితీ, నిస్వార్థపరత్వం మనందరికీ స్ఫూర్తినిస్తాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏరియా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.సిద్ధార్థ మాట్లాడుతూ.. కాళిదాసు విలువలకు ప్రతిరూపంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఎస్.ఆర్ మీనా, కాళిదాసు కోడలు మాధవ పెద్ది నిర్మల, కాళిదాసు మనుమడు కాళిదాససాయి, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, ప్రముఖ న్యాయవాది విన్నకోట సత్యప్రసాద్, రిటైర్డ్ అధ్యాపకులు శ్రీనివాస శర్మ, విజయకుమార్, చిత్రకారుడు జి.వి.సాహితీ భారతి అధ్యక్షుడు నరసింహవర్మ, రచయిత మల్లికార్జున, బందా బాబు, మానం అప్పారావు, కరణం రవీంద్ర, పొగడదండ హరిబాబు, మల్లికార్జున రావు, బండికళ్ల బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

టైలర్స్ అసోసియేషన్ నాయకులు శేషగిరిరావు మృతి



బాపట్ల: బాపట్ల పట్టణంలోని ప్రగతి టైలర్స్ అసోసియేషన్ నాయకులు కాకి శేషగిరిరావు(55) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. టైలర్స్ అసోసియేషన్ కోసం కృషి చేసిన శేషగిరిరావు మృతి టైలర్స్ యూనియన్‌కు తీరని లోటుగా నాయకులు పేర్కొన్నారు. శేషగిరిరావు మృతికి మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరరావు సంతాపం తెలిపారు.

మహిళలకు దుప్పట్లు పంపిణీ

తెనాలి, తెనాలి అర్బన్: పట్టణంలోని జై భీమ్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో పలువురి మహిళలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కటివరపు దేవయ్య సతీమణి దయామణి 8వ వర్ధంతి సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో జిలుగు పీటర్, శ్రీనివాస్, ఆశా, జై భీమ్ ఫెడరేషన్ టౌన్ అధ్యక్షులు గోవా కుమార్, ఎంపీటీసీ పేరం అరుణ ఉన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ అబ్రహం లింకన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పెనుమూడి వద్ద వరద నీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

రేపల్లె: ప్రకాశం బ్యారెజీ నుంచి వరద నీరు దిగువకు విడుదల చేసిన నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. పెనుమూడి పుష్కర్ ఘాట్ వద్ద గురువారం వరద నీటిని ఆయన పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ప్రస్తుతం 2.60 లక్షల క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం నడుస్తోందని అన్నారు. వరద నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని.. మండలంలోని నదీ పరివాహక గ్రామాల ప్రజలు వరద తగ్గే వరకూ చేపల వేటకు, పశువులను మేపేందుకు లంకలకు వెళ్లరాదని అన్నారు. నదీ పరివాహక ప్రాంతాలలోని వీఆర్వోలు, గ్రామ నౌకరులు ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామ నౌకరులు, తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణానికి ట్రయల్ రన్



గ్రామంలో పర్యటిస్తున్న పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ వీఆర్కే తేజ

తెనాలి టౌన్: తెనాలి నియోజకవర్గంలోని కొలకలూరు గ్రామాన్ని పారిశుద్ధ్య నిర్వహణ, డ్రెయిన్ల సమస్యలు ఏళ్ల తరబడి పట్టి పీడిస్తున్నాయి. ఈ క్రమంలోనే బుధవారం రాష్ట్ర ఆహార పౌర సరఫరాలశాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ గ్రామంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. ముఖ్యంగా 90 శాతం మేర రోడ్లకు ఇరువైపులా మురుగు కాలువలు లేకపోవడం ప్రధాన సమస్యగా గుర్తించారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ వీఆర్కే తేజ మైలవరపుతో ఫోన్‌లో మాట్లాడి కొలకలూరు గ్రామాన్ని సందర్శించి డ్రెయిన్ల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. దీంతో కమిషనర్ వీఆర్కే తేజ గురువారం గ్రామంలో అధికారులతో కలిసి పర్యటించారు. మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణం చేపడితే ఎలా ఉంటుందనే దానిపై అధికార బృందంతో ట్రయల్ రన్ వేయించారు. రెండు చోట్ల భూమిలోనే నీరు ఇంకిపోవడంపై ఆ శాఖ అధికారులు పరిశీలన చేశారు. ఆయన వెంట ఎంఈ ఎన్ఆర్‌జీఎస్ డైరెక్టర్ షణ్ముక్, అడిషనల్ కమిషనర్ శివప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి నాగ సాయికుమార్, డ్వామా పీడీ శంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ కళ్యాణ చక్రవర్తి, ఎంపీడీవో అత్తోట దీప్తి, డిప్యూటీ ఎంపీడీవో వైవిడి.ప్రసాద్, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి కరిముల్లా, ఉన్నారు.

ప్రాథమి హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

తెనాలి రూరల్: రూరల్ గ్రామం నందివెలుగు జాషువానగర్‌లో గురువారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తహసీల్దార్ కె.వి.గోపాలకృష్ణ మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరునికి సంక్రమించిన ప్రాథమిక హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాజంలో అంటరానితనం, అసమానతలు ఉండకూడదన్నారు. ఏ వ్యక్తినైనా ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టడం, కుల మతాల పేరుతో దూషించడం నేరమన్నారు. పౌరుల హక్కులు కాపాడేందుకు చట్టాలు ఉన్నాయన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా కూడా న్యాయ సలహాలు పొందవచ్చునని తెలిపారు. ఎలాంటి సమస్య వచ్చినా ముందు అధికారుల దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వి.జాన్, రూరల్ పోలీసులు పాల్గొన్నారు.

విద్యార్థులు సూర్య కుటుంబంగా ప్రదర్శన



ప్రాజెక్టును పరిశీలిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి

వెల్లటూరు(భట్టిప్రోలు): సూర్య కుటుంబం అనే ప్రాజెక్టును భట్టిప్రోలు మండలం వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న విద్యార్థులు రూపొందించారు. గురువారం స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులు గ్రహాలు, సూర్యుడిగా వాటి పని తీరును కళ్లకు కట్టినట్లు ప్రదర్శించి వివరించారు. ప్రాజెక్ట్ వర్క్ వల్ల ఆచరణలో నేర్పు గొప్ప విధానం, సృజనాత్మకత, పరిశోధన, నైపుణ్యం, విద్యార్థుల సమిష్టి పెంపొందుతుందని ప్రధానోపాధ్యాయురాలు కె.అరుణకుమారి తెలిపారు. ప్రాజెక్టును విజయవంతం చేయడంలో శిక్షణ ఇచ్చిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గుర్రం మురళీమోహన్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నక్కా వెంకటేశ్వర్లు, ఎస్టేట్ బాబు, శివరామకృష్ణ, కుటుంబరావు, వెంకటస్వామి, శైలజ, ఆశాలత, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన డెంగీ మాసోత్సవాలు



ర్యాలీలో పాల్గొన్న అధికారులు

తెనాలి అర్బన్: డెంగీ వ్యాధి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మలేరియా తెనాలి పట్టణ, మండల సబ్ యూనిట్ అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డిలు పేర్కొన్నారు. జాతీయ డెంగీ మాసోత్సవాల ముగింపును పురస్కరించుకుని కొత్తపేటలోని పాత ప్రభుత్వ వైద్యశాలలో గురువారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జులై 1 నుంచి 31వ తేదీ వరకూ జాతీయ డెంగీ మాసోత్సవాలను నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల్లో వ్యాధి పట్ల అవగాహన కల్పించేందుకు రోజూ ర్యాలీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, జి.రవికుమార్, దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, తిరుపీధుల శివరామప్రసాద్, షేక్ రషీద్, షేక్ నవీద్, సయ్యద్ కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

స్టువర్టుపురం ఎస్టీ గురుకులంలో సమస్యల తిష్ట



హాస్టల్‌లోని వంటను పరిశీలిస్తున్న మాచవరపు రవికుమార్



హాస్టల్‌లో అపరిశుభ్ర వాతావరణం

బాపట్ల అర్బన్: బాపట్ల మండలంలోని స్టువర్టుపురం ఎస్టీ గురుకులంలో సమస్యలు తిష్ట వేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి మాచవరపు రవికుమార్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు హాస్టల్స్‌లో పడుతున్న బాధలపై పరిశీలన చేయాల్సిందిగా సూచించటంతో ఆయన హాస్టల్స్‌ను పరిశీలిస్తున్నామని తెలిపారు. స్టువర్టుపురం హాస్టల్‌లో తాగునీరు సక్రమంగా లేదని, ఫిల్టర్ వాటర్ తయారీకి ఉంచిన ఆర్వో ప్లాంట్ పని చేయడం లేదని తెలిపారు. కూరగాయాలు కూడా పాడైపోయినవే ఎక్కువగా ఉపయోగిస్తున్నారని ఆయన తమ పరిశీలనలో వచ్చిందన్నారు. ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు మాట్లాడుతూ.. కనీసం మరుగుదొడ్లు కూడా శుభ్రంగా లేకపోవటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షులు గవిని శ్రీనివాస్ యాదవ్, ఎస్టీ సెల్ నాయకులు మొగిలి నాగేశ్వరరావు, కొండూరి ప్రసాదరెడ్డి, మంగలి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకా వేయించాలి

కొల్లిపర: వాతవరణ మార్పుల కారణంగా పశువులకు ముఖ్యంగా వచ్చే హీమోరేజిక్ సెప్టిసీమియా(హెచ్ఎస్) వంటి ప్రమాదకరమైన బ్యాక్టీరియా వ్యాధిని నియంత్రించేందుకు పశువులకు తప్పని సరిగా ముందస్తుగా హెచ్ఎస్ టీకాను వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ జి.కె.ప్రభు పాడి రైతులకు సూచించారు. కృష్ణా నదిలో వరద ఉధృతి పెరగడంతో గురువారం మండల పరిధిలోని అన్నవరపులంక, బొమ్మువానిపాలెం, లంక గ్రామంలోని పశువులకు హెచ్ఎస్ టీకాలను ఉచితంగా వేశారు.

ఉర్దూ భాషపై అభిమానం పెరిగేలా బోధించాలి



కొల్లిపర: ఉర్దూ పాఠశాలలోని విద్యార్థులకు ఉపాధ్యాయులు ఉర్దూ భాషపై అభిమానం పెరిగేలా విద్యను బోధించాలని ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసిం అన్నారు. మండల పరిధిలోని పిడపర్రు, మున్నంగి, కొల్లిపర గ్రామాల్లోని ఉర్దూ పాఠశాలలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు, ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం 100 శాతం అమలయ్యేలా కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులకు ఆయన సూచించారు. పిడపర్రులోని ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయలు షేక్ మోయిన్, కరీమున్నీసా తమ సొంత నిధులతో విద్యార్థులకు నోటు పుస్తకాలు, గుర్తింపు కార్డులు అందజేయడం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.